
సాక్షి
అనంతపురం
బుధవారం । 15 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.13, కనిష్టం రూ.3, సరాసరి రూ.7 పలికింది.

గరిష్టం/కనిష్టం
39.7°/16.9°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం పూట కొంత మేర చలి వాతావరణం కొనసాగింది.

రేపే కౌంటింగ్



జేఎన్‌టీయూ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది

- ఏర్పాట్లు కట్టుదిట్టం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు
- ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు
- ప్రక్రియ నిర్వహణకు 568 మంది సిబ్బంది
- ఇతర ఏర్పాట్లకు 91 మంది నియామకం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చివరి అంకం... అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓట్ల లెక్కింపు ఘట్టం ఈనెల 16న నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేస్తోంది. ఆరు జిల్లాల బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 568 మంది సిబ్బందిని నియమించారు. ప్రక్రియ నిర్వహణ, ఇతర ఏర్పాట్ల పర్యవేక్షణకు 91 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించారు.

లెక్కింపునకు మూడు బ్యాచ్‌లు

పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు మూడు బ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లెక్కింపు నిర్వహిస్తుంది. రెండవ బ్యాచ్ సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు పని చేస్తుంది. మూడవ బ్యాచ్ రాత్రి 12 నుంచి ఉదయం 8 గంటల వరకు లెక్కింపు చేపడుతుంది.

- ఇక ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు రెండు బ్యాచ్‌లు పనిచేస్తాయి. మొదటి బ్యాచ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రెండవ బ్యాచ్ సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహిస్తుంది.

38 టేబుళ్ల ఏర్పాటు

పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు మొత్తం 38 ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు, నిర్వహణ ఇన్‌చార్జ్‌లు, ఇతర ఏర్పాట్ల కోసం 659 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. ఓట్ల లెక్కింపునకు టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సహాయకులు, ఒక సూక్ష్మ పరిశీలకుడు (బ్యాంక్ అధికారులు), ఒక అటెండర్ ఉంటారు. ఈ క్రమంలో పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 24 టేబుళ్లకు మూడు బ్యాచ్‌లకు 392 మంది సిబ్బందిని, రిజర్వులో తొమ్మిది మంది మొత్తం 401 మందిని నియమించారు.

- ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 158 మంది సిబ్బందిని, రిజర్వులో తొమ్మిది మందిని మొత్తం 167 మందిని నియమించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో సిబ్బందికి భోజన వసతి, వాహనాల పార్కింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రో ఇన్‌చార్జ్‌లు, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జ్‌లు, బ్యాలెట్ కట్టల మిక్సింగ్ ఇన్‌చార్జ్‌లు, రౌండ్ వారీగా ఫలితాల పర్యవేక్షణకు, నివేదిక సమర్పణ, బ్లాక్‌బోర్డ్ ఇన్‌చార్జ్.. ఇలా వివిధ పనులకు 91 మంది అధికారులను, సిబ్బందిని నియమించారు.

బ్యాలెట్ బాక్సులు భద్రం

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అనంతపురం జిల్లా బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ రోజైన 13వ తేదీనే జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఇక శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల బ్యాలెట్ పెట్టెలను పోలీసు బందోబస్తుతో మంగళవారం జేఎన్‌టీయూకు తీసుకొచ్చారు. వాటిని జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. బ్యాలెట్ పెట్టెలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ గాయత్రీదేవి పరిశీలించారు. అనంతరం ఆ గదులకు సీల్ వేయించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్లు...	
పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,103
లెక్కింపునకు టేబుళ్లు	24
లెక్కింపునకు బ్యాచ్‌లు	3
లెక్కింపునకు సిబ్బంది	401
ఉపాధ్యాయ ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,884
లెక్కింపునకు టేబుళ్లు	14
లెక్కింపునకు బ్యాచ్‌లు	2
లెక్కింపునకు సిబ్బంది	167



స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ పెట్టెలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అప్రమత్తంగా విధులు

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్ ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లను గుర్తించడం, ప్రాధాన్యతా ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేయడం, విజేతను ప్రకటించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ రెండు నుంచి మూడు రోజులు పట్టొచ్చని, ఇందుకు అనుగుణంగా సిబ్బంది మానసికంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి అనుకూలంగా ఉండేందుకు మూడు షిఫ్టులుగా కౌంటింగ్ నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లను షిఫ్టుల వారీగా నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు



అనంతపురం: ఈ నెల 16న జేఎన్‌టీయూ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఫక్కీరప్ప అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులతో ఎస్పీ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత, పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం, పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు, ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయాలన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ పరిసరాల్లో స్థానికేతరులు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లపై నిఘా పెంచాలన్నారు. జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానితులకు లాడ్జీలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో వసతి కల్పించకుండా చూడాలన్నారు.

భానుడి భగభగలు

- 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి ఆరంభంలో పగటి ఉష్ణోగ్రతలు అదిరేలా నమోదవుతున్నాయి. మరోపక్క ఉదయం పూట అక్కడక్కడా చలి వాతావరణం కొనసాగుతున్నా... 10 గంటలయ్యే సరికి సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. సీజన్‌లో తొలిసారిగా మంగళవారం చాలా మండలాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి. గుంతకల్లులో 39.7 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. తాడిపత్రి, కళ్యాణదుర్గం, యల్లనూరు, కూడేరు, గుత్తి, పామిడి తదితర మండలాల్లో కూడా 39 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. అటు శ్రీసత్యసాయి జిల్లాలో కూడా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. పరిగి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కొత్తచెరువు, ముదిగుబ్బ, తనకల్లు, అమడగూరు తదితర మండలాల్లో 38 నుంచి 39 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మధ్యాహ్న సమయంలో వేసవి తాపం అధికంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు 35 నుంచి 39 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 15 నుంచి 20 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. మార్చి రెండో వారంలోనే 40 డిగ్రీలకు చేరువ కావడంతో ఏప్రిల్, మే మాసాల్లో తీవ్రత అధికంగా ఉండవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. వచ్చే రెండు నెలలూ చాలా మండలాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదుకావచ్చని అంచనా వేస్తున్నారు.

న్యూస్‌రీల్

17 వరకు ఈ-క్రాప్‌పై సామాజిక తనిఖీ



అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించిన ఈ-క్రాప్ నమోదుపై ఈ నెల 17 వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ కొనసాగిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఈ-క్రాప్ తుది ముసాయిదాను ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ రబీలో అన్ని పంటలూ కలిపి 2.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చినట్లు ఈ-క్రాప్ ద్వారా స్పష్టమవుతోందని తెలిపారు. ప్రధానంగా పప్పుశనగ, వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఆర్‌బీకే సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామగ్రామానా ఈ నెల 17 వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు. పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు.

బీఫార్మసీ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19, ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ www.jntua.ac.inను సందర్శించాలని సూచించారు.

17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు



అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఏపీ రీసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన పీహెచ్‌డీ సీట్లను ఈ నెల 17న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఏపీ రీసెట్-2022లో అర్హత సాధించి, సంబంధిత పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని వర్సిటీ పాలకభవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలు www.jntua.ac.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు.

18న జగనన్న విద్యా దీవెన



అనంతపురం రూరల్: 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన మొదటి విడత నగదును ఈ నెల 18న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

17 నుంచి 19 వరకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో ఈ నెల 17 నుంచి 19 వరకు తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 35.4-37.9, రాత్రి 19.8-21.0 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 66-78, మధ్యాహ్నం 24 - 40గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నాణెం.. తగ్గింది పరిమాణం

- పావలా సైజులో రూపాయి నాణెం
- రూ.10 సైజులో రూ.20 కాయిన్
- ఉమ్మడి జిల్లాలోని బ్యాంకులకు చేరిన కొత్త కరెన్సీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రిజర్వు బ్యాంకు ఇటీవల విడుదల చేసిన కొత్త నాణేలు, నోట్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు బ్యాంకులకు చేరాయి. తయారీ వ్యయం తగ్గించుకునే క్రమంలో నాణెం పరిమాణం కుదించేసినట్లు బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు. నాణెంపై ఓవైపు మూడు తలల సింహం, మరోవైపు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరుతో జాతీయ జెండాను చిహ్నంగా చూపించారు. కొత్తగా వచ్చిన నాణేలను నిశితంగా పరిశీలిస్తే గానీ అసలు విలువ చెప్పలేని పరిస్థితి.

కొత్తగా 20 రూపాయల నాణేలు..

ప్రస్తుతం 1, 2, 5, 10 రూపాయల నాణేలతో పాటు కొత్తగా రూ.20 నాణెం అందుబాటులోకి తెచ్చారు. దీంతో నాణేల చెలామణి సంఖ్య ఐదుకు చేరింది. గతంలో రూ.10 నాణెం ఉన్న పరిమాణంలో రూ.20 రూపొందించారు. పెద్ద నోట్ల రద్దు అనంతరం కరెన్సీ నోట్ల సైజు కూడా బాగా తగ్గిపోయిన విషయం తెలిసిందే. రూ.10, రూ.20, రూ.50తో పాటు రూ.500 నోట్ల సైజు బాగా తగ్గాయి. వెయ్యి రూపాయల నోట్లు పూర్తిగా రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా రూ.2వేల నోట్లు కూడా ముద్రించడం లేదు. అందుబాటులో ఉన్నవి మాత్రమే చెలామణిలో ఉన్నాయి.



కొత్త రూపాయి నాణేలు



రూ.20 కాయిన్లు

వారం కిందటే వచ్చాయి

“ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి వారం క్రితమే కొత్త నాణేలు వచ్చాయి. రూపాయి, రెండు, ఐదు, పది, 20 రూపాయలు కలిపితే మొత్తం ఐదు నాణేలు చెలామణిలో ఉన్నట్టు లెక్క. చిన్న నోట్ల విషయంలో అయితే ఎక్కువగా రూ.10, రూ.20, రూ.50 చెలామణిలో ఉంటాయి. పెద్దనోట్లు అయితే రూ.100, రూ.500 ఎక్కువగా ఉన్నాయి.

–సునీల్ కుమార్, మేనేజర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇంటర్ విద్యార్థులూ విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

రాప్తాడురూరల్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలుంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 27,906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అనంతపురం జిల్లాలో 60 కేంద్రాల్లో 18,599 మంది హాజరుకానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 17,319 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,280 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాల్లో 9,307 మంది హాజరుకానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 8,299 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,008 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ప్రతి గదిలోనూ సీసీ కెమెరా అమర్చారు. చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో ప్రశ్నపత్రం ఓపెన్ చేస్తారు. విద్యార్థులకు ఏ చిన్న సమస్య తలెత్తినా కంట్రోల్ రూంలోని 08554-277626 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని ఆర్‌ఐఓ సురేష్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏ స్థాయి అధికారి వద్ద కూడా సెల్‌ఫోన్ ఉండకూడదు. రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ కోసం, సమాచారం తెలుసుకునేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక కీప్యాడ్ ఫోన్లు వినియోగించేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఇవికూడా నేరుగా బోర్డు నుంచే సరఫరా చేశారు. సిమ్‌కార్డులు కూడా వారే పంపారు. బోర్డు పంపిన సెల్‌ఫోన్లు సీఎస్‌ల వద్ద తప్ప మరెవరివద్దా కనిపించకూడదని ఆర్‌ఐఓ తెలిపారు.

నేత్రపర్వం..శ్రీవారి అలుకోత్సవం

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి అలుకోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామి వారు అశ్వవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చతురంగ బలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వ బలం. కలియుగాంతంలో శ్రీవారు అశ్వ వాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటి చెప్పడం కోసమే నారసింహుడు అశ్వవాహనంపై ఊరేగుతారని వేద పండితులు వివరించారు. యాగశాలలో నిత్య హోమం తర్వాత శ్రీవారు విశేషాలంకరణతో ఆలయానికి సమీపంలోని సుద్దుల మండపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న భక్తులు 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద' అంటూ నామస్మరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్ని ఉత్సవాలకు ఉభయదారులుగా భక్తులు వ్యవహరిస్తే.. అలుకోత్సవానికి మాత్రం ఆనవాయితీ ప్రకారం ఆలయ సహాయ కమిషనర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అలుకోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, పాలక మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తీర్థవాది : ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ దశమి నాడు (ఈ నెల 2వ తేదీ) అంకురార్పణంతో ప్రారంభమైన విషయం విదితమే. ఈ ఉత్సవాలు ఫాల్గుణ బహుళ నవమి నాడు అంటే గురువారం పుష్పయాగోత్సవంతో ముగియనున్నాయి. బుధవారం స్వామివారి తీర్థవాది ఉత్సవం భృగుతీర్థం(కోనేరు)లో భక్తుల కోలాహలం నడుమ నిర్వహించనున్నారు.



విశేషాలంకరణలో శ్రీవారు



అలుకోత్సవానికి హాజరైన భక్తులు

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన మంత్రి ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్ కలిశారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు విజయవాడకు వెళ్లిన సందర్భంగా ఆమె సీఎం జగన్‌ను కలిసి మాట్లాడారు. నియోజకవర్గం పరిస్థితులను వివరించి, చిరకాల స్వప్నంగా ఉన్న బీటీపీకి సాగు, తాగునీటిని అందించాలని కోరారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే భూసేకరణ పూర్తయి, సంబంధిత రైతుల ఖాతాల్లోకి పరిహారం సొమ్ము జమ అయినట్లు తెలిపారు. ఈ పనులు సత్వరమే పూర్తి చేసేలా అనుమతులు ఇవ్వాలని అభ్యర్థించారు.

ఎస్కేయూలో ఇకపై ఒకే క్యాంపస్.. ఒకే ప్రిన్సిపాల్!

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ కళాశాలను ఒకే గూటి కిందకు తెచ్చే ప్రక్రియ మొదలైంది. ఇంత కాలం సైన్స్, ఆర్ట్స్ క్యాంపస్ కళాశాలలుగా విభజించి వేర్వేరు ప్రిన్సిపాళ్లను నియమించారు. ఒకే కళాశాలతో పాటు ఒకే ప్రిన్సిపాల్ ఉండాలనే వర్సిటీ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇదే తరహాలోనే ఒకే ప్రిన్సిపాల్ పర్యవేక్షణలోనే వ్యవహారాలు కొనసాగాయి. అయితే 2016లో ఆర్ట్స్, సైన్స్ విభాగాలుగా విభజించారు. ఇందుకు చట్టబద్ధత లేకపోవడంతో అవరోధాలు ఎదురయ్యాయి. దీంతో ఒకే ప్రిన్సిపాల్ ఆమోదయోగ్యమైన నేపథ్యంలో ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్‌లను విలీనం చేయనున్నారు. 2023 విద్యా సంవత్సరం జూన్ నుంచి ప్రారంభం కానుండడంతో అప్పటిలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సీనియార్టీలో ఎవరైతే ముందుంటారో వారినే ప్రిన్సిపాల్‌గా నియమించే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీనియార్టీలో ముందున్న డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్‌కు ప్రిన్సిపాల్ హోదా దక్కనున్నట్లు విశ్వసనీయ సమాచారం. పాలక మండలి సమావేశంలో చర్చించిన అనంతరం విలీన ప్రక్రియ అంశం ఓ కొలిక్కి రానుంది.

సిరుల పట్టు

- నాలుగు ఎకరాల మల్బరీ ద్వారా ఏడాదిలో 10 పంటలు
- పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.10 లక్షల నికరాదాయం
- మల్బరీతో గట్టెక్కిన రైతు సత్యనారాయణరెడ్డి



అనంతపురం అగ్రికల్చర్: మల్బరీని నమ్ముకున్న రైతు ఇంట 'పట్టు' సిరులు కురిపిస్తోంది. మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తుండడంతో ఇటీవల చాలా మంది రైతులు మల్బరీ (రేషం) సాగుపై దృష్టి సారించారు. పట్టుగూళ్ల పండించడంలో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే తొలిస్థానం సంపాదించింది. ప్రస్తుతం ఓసత్యసాయి జిల్లా అగ్రస్థానంలో ఉండగా 'అనంత' మూడో స్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఉద్యోగం మాదిరిగా రేషం పంట ప్రతి నెలా రైతు ఇంట కాసులు కురిపిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. భార్యాభర్తలతో పాటు మరో ఇద్దరు కూలీలు ఉంటే చాలు మల్బరీ సాగుకు మించిన ఆదాయపు పంట మరొకటి లేదని నిరూపించిన రైతు సత్యనారాయణరెడ్డి విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఎకరాతో మొదలై...

గుమ్మఘట్ట మండలం దేవరెడ్డిపల్లికి చెందిన రైతు సత్యనారాయణరెడ్డి (94403 74940) ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో మల్బరీ పంట సాగు చేస్తున్నారు. 2015లో ఒక ఎకరాతో మొదలు పెట్టి మల్బరీ సాగు.. ఇటీవల నీటి వనరులు పెరగడంతో నాలుగు ఎకరాలకు పెంచారు. ప్రభుత్వం అందజేసిన ప్రోత్సాహకం, రాయితీ పథకాలతో రేషంషెడ్డు, సూట్ రేటింగ్, ఇతర సౌకర్యాలను సమకూర్చుకున్నారు. రైతు శ్రమకు కుటుంబసభ్యులు తోడయ్యారు. మరో ఇద్దరు కూలీలను ఏర్పాటు చేసుకుని పట్టు సాగులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

ఏటా రూ.10 లక్షల ఆదాయం

జూలై 2021 నుంచి జూలై 2022 మధ్య అంటే సరిగ్గా ఏడాది కాలంలో విడతకు 250 నుంచి 300 గ్రుడ్లు (మట్టి) ప్రకారం లెక్క వేసుకుని పట్టు పురుగులను రైతు సత్యనారాయణరెడ్డి మేపారు. ఇలా ఏడాది కాలంలో 10 పంటలు అవలీలగా పండించారు.విడతకు రూ.30 వేల చొప్పున అన్ని రకాల ఖర్చులు పోను ఏడాదికి తీసిన 10 పంటలకు గానూ నికరంగా రూ.10 లక్షల ఆదాయాన్ని గడించారు. తాను పండించిన పట్టుగూళ్లను ఎక్కువ శ్రమ తీసుకోకుండా హిందూపురం, ధర్మవరం మార్కెట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



మల్బరీ తోట

గతమంతా నష్టాలే..



గతంలో సంప్రదాయ వ్యవసాయంలో చాలా కష్ట, నష్టాలు చవిచూశాను. 2014లో బోరుబావులు ఎండిపోయాయి. దీంతో పక్క గ్రామంలో మల్బరీ సాగు చేస్తున్న రైతును చూసి, నేను కూడా అప్పట్లో ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేపట్టాను. 2021 నాటికి నాలుగు ఎకరాలకు విస్తరించాను. కిలో పట్టుగూళ్లను రూ.650 నుంచి రూ.900 వరకూ మార్కెట్‌లో విక్రయించాను. ఏడాదిలో ఎంత లేదన్నా రూ.10 లక్షల ఆదాయం సమకూరింది.

– రైతు సత్యనారాయణరెడ్డి, దేవరెడ్డిపల్లి, గుమ్మఘట్ట మండలం

ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మరింత లబ్ధి



మల్బరీ సాగు చేపట్టాలనుకునే రైతులకు జగన్ సర్కారు పెద్ద ఎత్తున ప్రోత్సాహక రాయితీలు ఇస్తోంది. పుల్ల నాటుకునే దశ నుంచి పట్టుగూళ్లు మార్కెట్‌లో అమ్ముకునే వరకూ అడుగడుగునా ప్రభుత్వంతో పాటు పట్టుశాఖ అండగా ఉంటుంది. ఎకరా విస్తీర్ణంలో పుల్ల నాటుకునేందుకు రూ.18,750 నుంచి రూ.22,500 ఇస్తారు. పెద్ద సైజు షెడ్డు ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.3.60 లక్షలు, చిన్న సైజు షెడ్డుకు రూ.2.25 లక్షల నుంచి రూ.2.70 లక్షలు, సూట్‌రైటింగ్, యాంత్రీకరణ, బైవోల్టీన్ చాకీ చార్జీలు, షెడ్డు పరిశుభ్రతకు, మార్కెట్‌లో కిలో పట్టుగూళ్లకు ఇన్సెంటివ్‌లు, ఉపాధి హామీ కింద మరికొంత ఆర్థిక సహకారం ఉంటుంది. మల్బరీ పంటకు మించిన ఆదాయం ఇచ్చే పంట మరొకటి లేదు. రైతులు ముందుకు వస్తే ప్రోత్సాహక రాయితీలు వర్తింపజేస్తాం.

– ఆంజనేయులు, పట్టుశాఖ జిల్లా అధికారి, అనంతపురం

జ్వరంతో విద్యార్థిని మృతి



జ్యోతి (ఫైల్)

గుంతకల్లు: తీవ్ర జ్వరం కారణంగా ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు.. గుంతకల్లు మండలం పులగుట్టపల్లి పెద్ద తండాకు చెందిన ఎన్.పార్వతి (గ్రామ సర్పంచ్), వెంకటేష్‌నాయక్‌కు కుమారుడు మోహన్‌నాయక్, కుమార్తె జ్యోతి (17) ఉన్నారు. పట్టుదలతో కుమారుడిని ఎంబీబీఎస్ చదివిస్తున్నారు. ఈ క్రమంలో కుమార్తెను సైతం డాక్టర్‌గా చేయాలని తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పదిరోజుల క్రితం జ్యోతి తీవ్రమైన జర్వం బారిన పడింది. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. సోమవారం జ్వరం తీవ్రత కారణంగా జ్యోతి మృతి చెందింది. మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్ తదితరులు ఆ గ్రామానికి చేరుకుని జ్యోతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

పెండింగ్ బిల్లులు రూ.11.97 కోట్లు విడుదల

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా రహదారులు, భవనాల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు రూ.11.97 కోట్లు విడుదలైనట్లు పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) యమ్మాని భాగ్యరాజ్ మంగళవారం తెలిపారు. కాంట్రాక్టర్ల ఖాతాల్లో బిల్లులు జమ చేసినట్లు వివరించారు. నియోజకవర్గాల వారీగా అనంతపురం అర్బన్‌కు రూ.135.46 లక్షలు, గుంతకల్లుకు రూ.30.30 లక్షలు, కళ్యాణదుర్గానికి రూ.70.34 లక్షలు, రాప్తాడుకు రూ.1.74 లక్షలు, రాయదుర్గానికి రూ.451.61 లక్షలు, శింగనమలకు రూ.109.95 లక్షలు, తాడిపత్రికి రూ.335.85 లక్షలు, ఉరవకొండకు రూ.62.40 లక్షల చొప్పున నిధులు విడుదలైనట్లు వెల్లడించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



వన్నూర్‌బాషా(ఫైల్)

ఉరవకొండ: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన ఉరవకొండలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక 8వ వార్డు పాతపేటలో నివాసముంటున్న ఖాజావలి కుమారుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు దూదేకుల వన్నూర్‌బాషా (25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి రెండు రోజుల క్రితం ఉరవకొండకు వచ్చాడు. మంగళవారం బాత్‌రూంలో గుండె నొప్పితో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా కూడేరు సమీపంలో మృతిచెందాడు. మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి సంతాపం తెలిపారు.

'బైజూస్ కంటెంట్' ప్రాధాన్యత తెలీదా?

- విద్యార్థులను మానిటరింగ్ చేయకపోతే ఎలా?
- హెచ్ఎం, ఉపాధ్యాయులపై డీఈఓ సాయిరాం ఆగ్రహం



టీచర్ల డైరీలను పరిశీలిస్తున్న డీఈఓ సాయిరాం

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన బైజూస్ కంటెంట్‌కున్న ప్రాధాన్యత తెలియకపోతే ఎలా? విద్యార్థులు ట్యాబ్‌లు వాడుతున్నది? లేనిది? మానిటరింగ్ చేయకపోతే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోదా? అంటూ ఉపాధ్యాయులను డీఈఓ సాయిరాం నిలదీశారు. అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల నోట్, వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఇద్దరు విద్యార్థుల బై జూస్ ట్యాబ్‌ల్లో కంటెంట్ లేకపోవడంతో హెచ్ఎం, టీచర్లపై అసహనం వ్యక్తం చేశారు. ట్యాబ్‌ల వినియోగంపై నిరంతర నిఘా ఉండాలని సూచించారు. టీచర్ల డైరీలు అప్డేట్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. డీఈఓ వెంట డీసీఈబీ కార్యదర్శి లోకేశ్వరరెడ్డి, ఏపీఓ నారాయణస్వామి ఉన్నారు.

ట్యాబ్‌లు దుర్వినియోగమైతే టీచర్లదే బాధ్యత

బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లు దుర్వినియోగమైతే సంబంధిత టీచర్లదే బాధ్యత అని డీఈఓ ఎం.సాయిరాం హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 21,632 మంది 8వ తరగతి విద్యార్థులు, 3,991 మంది 8వ తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందజేసినట్లు గుర్తుచేశారు. ఈ ట్యాబ్‌లు దుర్వినియోగమైతే సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

వ్యక్తిగత పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఈఓ సాయిరాం, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, వారు మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వం నిర్వహిస్తున్న నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేతులను శుభ్రం చేసుకునే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, వనజాక్షి, హెచ్ఎం కిరణ్మయి, డాక్టర్ నారాయణ స్వామి, మేనేజర్ రజిత, డీసీఈబీ కార్యదర్శి లోకేశ్వర్ రెడ్డి, డాక్టర్ తేజస్విని, వెంకట రమణ నాయక్, ఎంఈఓ వెంకట స్వామి , డిప్యూటీ డెమో త్యాగరాజు, వేణు, కిరణ్ పాల్గొన్నారు.

టీవీలు పెట్టొద్దు.. సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు

రాప్తాడు: 'ఏమ్మా...మీ .అమ్మాయి ఈ ఏడాది పదో తరగతి కదా.. స్కూలు వదిలిన తర్వాత ఇంటి వద్ద ఎలా చదువుతోంది. చదివేటప్పుడు టీవీ పెట్టకండి. సెల్‌ఫోన్ కూడా చేతికివ్వకండి' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు డీఈఓ సాయిరాం సూచించారు. నైట్ విజన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో ఆయన పర్యటించి, పదో తరగతి విద్యార్థులను సందర్శించారు. ఇంటి వద్ద విద్యార్థులు ఎలా చదువుతున్నారంటూ తల్లిదండ్రులను ఆరా తీశారు. విద్యార్థుల వర్క్ బుక్కు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయని సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఒత్తిడికి లోనూ కాకుండా కృషి పట్టుదలతో చదివితే విజయం మీ సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలమురళి కృష్ణ, ఏపీఓ నారాయణ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. .

విద్యుత్ ప్రమాద బాధితురాలి మృతి

- గత ఏడాది నవంబర్‌లో ఘటన
- 6కు చేరిన మృతుల సంఖ్య



సుంకమ్మ (ఫైల్)

బొమ్మనహాళ్: గత ఏడాది చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ.. ఇన్ఫెక్షన్ కారణంగా మంగళవారం ఉదయం మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గత ఏడాది నవంబర్ 2న బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ట్రాక్టర్ ట్రాలీపై పడిన ఘటనలో నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో మరుసటి రోజు బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతూ మరో మహిళా కూలీ మృతి చెందింది. ఘటనలో కుడి కాలు కోల్పోయి ప్రాణాలతో బయటపడిన సుంకమ్మ (48) కొన్ని రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకుంది. అయితే గాయాలు నయం కాక ఇన్ఫెక్షన్ సోకి ఐదు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతూ వచ్చిన సుంకమ్మ పరిస్థితి విషమించడంతో మంగళశారం ఉదయం ఇంటి వద్దనే మృతి చెందింది. దీంతో విద్యుత్ ప్రమాద మృతుల సంఖ్య ఆరుకు చేరుకున్నట్టైంది. సుంకమ్మకు భర్త బొజ్జప్పతో పాటు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

మార్కుల మాయాజాలం

- బోగస్ మార్కుల జాబితాతో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు
- ఇప్పటి వరకు 8 మందివి నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ

కొంత మంది అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడానికి బరి తెగిస్తున్నారు. వారికి కొందరు సహకరిస్తున్నారు. దీంతో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పలువురు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. తాజాగా ఈ వ్యవహారం వెలుగుచూడటంతో వైద్య, ఆరోగ్యశాఖలో అలజడి నెలకొంది.

కడప రూరల్: కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి ప్రభుత్వం గత ఏడాది నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి (జోన్-4)లో దాదాపు 12,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయలసీమ వ్యాప్తంగా అభ్యర్థులు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. మెరిట్ ప్రాతిపదికన మొత్తం 291 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్ తర్వాత నాలుగేళ్ల స్టాఫ్ నర్సు కోర్సు లేదా బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సులకు గుర్తింపు ఉంటుంది. అంటే ఈ యూనివర్సిటీ వారు జారీ చేసిన మార్కుల జాబితాతో పాటు ఇతర సర్టిఫికెట్లను ప్రామాణికంగా తీసుకుంటారు. అత్యధిక మార్కుల ప్రాతిపదికన స్టాఫ్ నర్సు నియామకాలు చేపట్టారు. దీన్ని గమనించిన కొంత మంది అభ్యర్థులు ఏకంగా బోగస్ మార్కుల జాబితాను సృష్టించి ఉద్యోగాలు పొందారు.

అనుమానంతో తీగ లాగడంతో...

ఈ వ్యవహారమంతా దాదాపు చిత్తూరు జిల్లా కేంద్రంగా జరిగింది. ఆ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కుమార్తెకు స్టాఫ్ నర్సు ఉద్యోగం రాలేదు. తన కుమార్తెకు మార్కుల పరంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అనుమానించారు. దాదాపు 15 మందిపై దృష్టి సారించారు. వారిపై కడపలోని వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్‌తోపాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ఫిర్యాదు చేశారు. అందులో కొన్ని బోగస్ మార్కుల జాబితాలు ఉన్నట్లు హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. కాగా... వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చేముందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌లోనూ అధికారులు నకిలీ మార్కుల జాబితాలను కనిపెట్టలేకపోయారు.



కడపలోని వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

వారు వీరేనా?

చిత్తూరు జిల్లాలో కోవిడ్ సమయంలో స్టాఫ్ నర్సుల నియామకాలను విరివిగా చేపట్టారు. ఆ సందర్భంగా కొంత మంది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అభ్యర్థులకు తక్కువ మార్కులు ఉన్నా ఎక్కువ ఉన్నట్లుగా సృష్టించి కాంట్రాక్టు నర్సులుగా నియమించారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అలా నాడు బోగస్ మార్కుల జాబితాను పొందిన వారిలో కొంత మంది తాజాగా చేపట్టిన స్టాఫ్ నర్సు నియామకాల్లో ఉద్యోగాలు సాధించినట్లు వినికిడి. ఈ అంశంపై లోతుగా విచారణ చేస్తే మరి కొంత మంది బయటపడతారని ఆ శాఖ ఉద్యోగులు భావిస్తున్నారు.

చట్టపరమైన చర్యలు

15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లుగా మా దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపాము. వారిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్ అని యూనివర్సిటీ వారు నిర్ధారించారు. వారిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, వైద్య, ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్

తక్షణ స్పందనతో విపత్తులకు అడ్డుకట్ట

- జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి

అనంతపురం సిటీ: అగ్ని ప్రమాదం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు తక్షణ స్పందనతో నష్ట నివారణకు అడ్డుకట్ట వేయవచ్చునని జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి అన్నారు. అనంతపురం శివారులోని టీటీడీసీలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆపద మిత్రలకు 12 రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సీఈఓ భాస్కర రెడ్డి హాజరై, మాట్లాడారు. విపత్తులు సంభవించినప్పుడు అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడకు చేరుకునేలోపు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ క్రమంలో విపత్తు సమయంలో స్పందించాల్సిన తీరుపై అందజేస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని, అత్యవసర సమయంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. శిక్షణ మేనేజర్ నిర్మల్ దాస్, జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్యకుమారి, డీఎల్‌డీఓ శివారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

15 మంది విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న 15 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో పది మంది, గుంతకల్లులో ముగ్గురు, కదిరి, తాడిపత్రిలో ఒక్కరు చొప్పున విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఓర్వ లేక బోరు పూడ్చారు


ధ్వంసం చేసిన బోరును చూపుతున్న రైతు

ఆత్మకూరు: బోరుబావిలో సమృద్ధిగా నీరు పడడం చూసి ఓర్వలేక గుర్తు తెలియని వ్యక్తులు పూడ్చేశారంటూ ఆత్మకూరుకు చెందిన రైతు బందూక లక్ష్మన్న ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయని, దీంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో రెండు నెలల క్రితం తన పొలంలో ఉచిత బోరు వేయించుకున్నట్లు వివరించాడు. నీరు సమృద్ధిగా పడడంతో 15 రోజుల క్రితం బోరు బావిలోకి మోటారు దింపే ప్రయత్నం చేశానన్నాడు. అయితే బోరులో కొద్ది లోతుకు వెళ్లిన తర్వాత మోటారు ఇరుక్కుపోవడంతో మరుసటి రోజు దానిని వెలికితీద్దామనుకుని రాత్రికి ఇంటికి చేరుకున్నానన్నాడు. మరుసటి రోజు ఉదయం అక్కడకు చేరుకుని చూస్తే బోరుబావిని పూర్తిగా ధ్వంసం చేసి, సగానికి పైగా బావిని మట్టితో పూడ్చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనకు పాల్పడిన వారి కోసం ఇంత కాలం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు వివరించాడు.

17న వాసవీమాతకు కొత్త చీరలతో అర్చన

అనంతపురం కల్చరల్: ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 17న కొత్తూరు ఆర్యవైశ్య అమ్మవారి శాలలో వాసవీమాతకు కొత్త చీరలతో అలంకారం, అర్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు, వాసవీమహిళా మండలి అధ్యక్షులు నిర్మలదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 సాయంత్రంలోపు భక్తులు అమ్మవారికి కొత్త చీరలు సమర్పించి అలంకార సేవల్లో పాల్గొనాలని కోరారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా హరి

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన కవి గుత్తా హరిసర్వోత్తమనాయుడును శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా హరిని సాహిత్యభారతి గౌరవాధ్యక్షులు డాక్టర్ పతికిరమేష్ నారాయణ, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీసమితి అధ్యక్షులు రియాజుద్దీన్ అభినందించారు.

దళిత, గిరిజనులకు న్యాయం చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళితులు, గిరిజనులకు ప్రభుత్వాలు న్యాయం చేయాలని అఖిల పక్ష పోరాట సమితి చైర్మన్ బీసీఆర్ దాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో దళిత,గిరిజన అఖిలపక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఆర్ దాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దళిత, గిరిజనులకు సరైన న్యాయం చేకూరలేదన్నారు. సంక్షేమ పథకాలు అందకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేపీ నారాయణ స్వామి, సాకే హరి, తిరుపాలు, బాలపెద్దన్న, ఉమామహేశ్వరి, ముత్యాలమ్మ, ఈశ్వరయ్య, ఎల్లన్న, సాకే గోవిందు, పోలా వీరా, జయప్రకాష్, ముసలయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించండి

ఆత్మకూరు: గాలికుంటు వ్యాధి నివారణకు గ్రామాల్లో ఉన్న రైతులు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి తులసీరామ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సింగంపల్లి తండా గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు జ్వరం, కాలి గిట్టల చీళ్లు తదితర సమస్యలు రాకుండా ఉండేందుకు టీకాలు ఉపయోగపడతాయన్నారు. ఆవులు, ఎనుములకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ నాయక్ తదితర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

రాప్తాడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం శివారులోని రుద్రంపేటకు చెందిన గోవిందనాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ద్రాక్ష కటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ధర్మవరం మండలం నడిమిదొడ్డిలో ద్రాక్ష కటింగ్‌కు తోటి కూలీలతో కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలోని ధర్మవరం కుడికాలువ వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన గోవిందనాయక్‌ను తోటి కూలీలు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రాప్తాడు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

• హాయివే

ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో వేడిమిని తట్టుకోవడానికి నగరంలో ఏళ్ల క్రితం నాటిన చెట్లు గొడుగులా చల్లని గాలినందిస్తున్నాయి. నగరంలో వైద్య కళాశాల ప్రాంతం, రైల్వే స్టేషన్ రోడ్డు, అరవిందనగర్, జిల్లా పరిషత్ తదితర ప్రాంతాల్లో ఉన్న పెద్ద వృక్షాల కింద ప్రజలు సేదతీరుతున్నారు. ఆ దారుల్లో హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


ఆర్‌ఓబీ రోడ్డులో ఇలా..


వైద్య కళాశాల మార్గంలో ఆహ్లాదం


రైల్వేస్టేషన్ రోడ్డులో చెట్ల నీడన వ్యాపారులు, వాహనదారులు


జెడ్పీ కార్యాలయం ముందు ఫుట్‌పాత్‌పై చెట్ల నీడన కునుకు తీస్తున్న యాచకులు

ఉపాధ్యాయుడిపై దాడి

యాడికి: విధులు ముగించుకొని కారులో తోటి ఉపాధ్యాయులతో కలిసి తాడిపత్రికి వెళ్తున్న ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడ్డారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. రాయల చెరువుకు చెందిన రవికుమార్ యాడికి ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ తాడిపత్రిలో ఉంటున్నాడు. మండల కేంద్రంలోని కోన రోడ్డులో బంధువుల హోటల్‌కు పోయి టీ తాగుతూ ఉండేవాడు. అయితే మండల కేంద్రానికి చెందిన బద్రీ అనే టైలర్ టీచర్ రవి కుమార్‌ను ఆ హోటల్‌కు వెళ్లకూడదని గతంలో గొడవ పడ్డాడు. అప్పటి నుంచి రవి కుమార్ ఆ హోటల్‌కు పోవడం లేదు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి తన సహచర ఉపాధ్యాయులతో కలిసి తన కారులో తాడిపత్రికి బయలుదేరాడు. వేములపాడు సమీపంలోని కస్తూర్బా పాఠశాల వద్ద వేములపాడుకు చెందిన రాజ్ కుమార్‌తో పాటు మరో నలుగురు కారును ఆపి మా మామ బద్రీ చెప్పినా కూడా నీవు కోన రోడ్డులో ఉన్న హోటల్‌కు పోతావా అంటూ రవికుమార్‌పై దాడి చేశారు. తర్వాత కారు అద్దాలను పగులగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బద్రీ, రాజ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుట్లూరు: మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. కంబగిరి అనే వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. నొప్పి తాళలేక మంగళవారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జాతీయ స్థాయిలో కీర్తి చాటాలి


క్రీడాకారులను అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జాతీయ స్థాయిలో అనంతపురం జిల్లా కీర్తిని చాటి చెప్పాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆకాంక్షించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన చిన్నారులను ఆమె అభినందించారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం క్రీడాకారులతో పాటు కోచ్‌లు ఆమెను కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మాస్టర్ శబరీశ్, మాస్టర్ ప్రణవ్, భవిష్యను గిరిజమ్మ అభినందించారు. వారితో పాటు రజత పతకాలు సాధించిన మరో ఇద్దరితో పాటు కాంస్య పతకాలు సాధించిన ఇంకో ముగ్గురిని కూడా ఆమె అభినందించారు. కోచ్‌లు శ్రీకాంత్, యోగానంద, రామాంజినేయులు, ఖలీం, షెక్షావలికి జెడ్పీ చైర్‌పర్సన్ అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌రెడ్డి, తైక్వాండో క్రీడాకారుడు సురేంద్ర పాల్గొన్నారు.

ముతవల్లి సస్పెన్షన్‌పై ముస్లింల హర్షం


మాట్లాడుతున్న జామియా మసీదు కమిటీ సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జామియా ముతవల్లిని సస్పెండ్ చేయడం పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మాసుమా బీబీ దర్గాలో జామియా మసీదు కమిటీ సభ్యులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు మన్సూర్, చాంద్‌బాషా మాట్లాడుతూ 40 ఏళ్లుగా జామియా మసీదు ముతవల్లిగా షఫీవుల్లా, ఆయన కుమారుడు షకీల్‌షఫీలు ముస్లింలకు చెందాల్సిన వాటిని దక్కకుండా చేశారన్నారు. వక్ఫ్ బోర్డుకు ఎన్నికలు జరపకుండా ముతవల్లిగా కొనసాగారన్నారు. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేశారని, అక్రమ కేసులను బనాయించారన్నారు. అనంతపురం నగరంలో వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ఇన్‌చార్జ్ మంత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్‌లకు వివరించామన్నారు. వారు ప్రత్యేక కమిటీని నియమించి సస్పెండ్ చేయడం గర్వకారణమన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను ప్రత్యేక అధికారి స్వాధీనం చేసుకోవాలని పేర్కొనడం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న వారికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కమిటీ సభ్యులు ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా నివేదిక అందించాలని కోరారు. అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు రియాజ్, అన్సర్, మహబూబ్‌బాషా, తబ్రేజ్, షకీల్, ముష్కు, సర్దార్, యూనుస్, ఎంఎస్ బాషా, మహబూబ్, గోల్డ్‌స్మిత్ బాషా, అన్ను తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయొద్దు

• మేయర్ వసీం


లక్ష్మీనగర్‌లో ఖాళీ ప్రదేశాల్లో వేసిన వ్యర్థాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: భవన నిర్మాణ వ్యర్థాలు ఖాళీ స్థలాల్లో వేయకూడదని, నగరపాలక సంస్థ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించి సంబంధిత నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం నగరంలో 39వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌లో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో వేస్తుండడాన్ని తప్పుబట్టారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం క్లాప్ ఆటో కార్యక్రమంపై ఆరా తీశారు. చెత్త రహిత నగరమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.కోట్లతో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, చెత్తను మూడు విభాగాలుగా చేసి అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేయర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు చింతకుంట మధు, రఫి, ఖాజా, తదితరులున్నారు.

మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట..

కోవూర్‌నగర్‌లోని మస్జీద్‌ను మేయర్ పరిశీలించి స్థానిక మైనార్టీలతో మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఒక్కపొద్దు పాటించే మైనార్టీలకు గంట ముందే విధులు మినహాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. మైనార్టీ పెద్దలతో సీఎం వైఎస్ జగన్ సమావేశం నిర్వహించి, విజయవాడ, కడపలోని హౌజ్ నిర్మాణం, ఖాజీల పదవీ కాలం పెంపు, అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం శుభపరిణామమన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాయుడు, ఏనాడూ మైనార్టీల గురించి పట్టించుకోలేదని విమర్శించారు.

మార్క్స్ స్ఫూర్తితో పోరాటాలు


కారల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: పీడితవర్గాల పక్షాన నిలిచి పోరాడిన కారల్‌మార్క్స్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని సీపీఎం నాయకులు అన్నారు. కారల్ మార్క్స్ 140వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు మసూద్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ ఒకటో నగర కమిటీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినదించిన గొప్ప విప్లవకారుడు మార్క్స్ అని కొనియాడారు. ఆయన బాటలో ప్రతి కార్యకర్త నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, ప్రకాశ్, వలి, సూర్యచంద్ర, బాలకృష్ణ, నూరుల్లా, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం


రాప్తాడులో చిన్నారులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి శ్రావణి


విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి


50వ డివిజన్‌లో మాత్రలు వేస్తున్న దృశ్యం

రాప్తాడు: నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారులు శ్రావణి, శివకృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు బాల, బాలికల్లో నులి పురుగుల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. దీంతో రక్తహీనత కలిగి ఎదుగుదల లోపించడంతో పాటు కడుపునొప్పి వస్తుందన్నారు. బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలను చప్పరించి మింగటం వల్ల నులిపురుగులు తొలగిపోయి రక్తహీనత నుంచి కోలుకుంటారన్నారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త తప్పనిసరి

ఆత్మకూరు: పిల్లలకు సంబంధించి తల్లితండ్రులు ఆరోగ్య విషయాలపై జాగ్రత్త వహించాలని మండల వైద్యాధికారి దయాకర్ తెలియజేశారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు, పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలంలో 6,850 మంది పిల్లలకు మాత్రలు వేశామన్నారు. దీంతో పిల్లల్లో రక్తహీనత తొలగి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, ఆత్మకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాఘవ, ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, మునాఫ్, సీహెచ్‌ఓ చంద్రవతి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి పరిశుభ్రత ముఖ్యం

కనగానపల్లి: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పరిశుభ్రత చాలా ముఖ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్. సాల్మాన్ తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. మామిళ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై సిబ్బందితో మాట్లాడారు. తర్వాత ఆరోగ్య సిబ్బందితో కలసి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం కనగానపల్లిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదగాలంటే పరిశుభ్రతతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, భానురేఖ, సీహెచ్‌ఓ గోవిందమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, మునిలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

రాప్తాడురూరల్: రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ గిరిధర్ మాట్లాడుతూ మంచి అలవాట్లు లేకపోవడం, కలుషితమైన నీరు, ఆహార పదార్థాలు తినడం వల్ల సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులు తరచూ చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

అనంతపురం క్రైం: నగరంలో 50వ డివిజన్‌లోని పలు స్కూళ్లలో విద్యార్థులకు కార్పొరేటర్ గురుశేఖర్ బాబు, హెల్త్ సెక్రటరీ మాలతి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నులిపురుగులతో తలెత్తే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ శైలజ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత


మహిళా దినోత్సవానికి హాజరైన డ్వాక్రా సంఘాల లీడర్లు

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోందని వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో వీరబ్రహ్మేంద్ర మహిళ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులు, పలువురు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, సున్నా వడ్డీ పథకాలను అమలుచేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోందన్నారు. మహిళలు సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం హేమలత, డ్వాక్రా సంఘం మండల లీడర్లు నల్లమ్మ, రాములమ్మ, పలువురు గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధితురాలికి నగదు అందజేస్తున్న ఎంపీపీ హేమలత, నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటోందని ఎంపీపీ హేమలత తెలిపారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బాబు (49) అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించాడు. ఆయన కుటుంబసభ్యురాలు రాములమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను మంగళవారం ఆత్మకూరులో ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, వన్నూరప్ప, అశ్వని, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుర్లపల్లయ్య స్వామి ఊరేగింపు



రాప్తాడు: మండల కేంద్రంలో మంగళవారం ధర్మపురి కుర్లపల్లయ్య స్వామిని కురుబ కులానికి చెందిన పామాల్ల వంశస్తులు వైభవంగా ఊరేగించారు. రాప్తాడుకు చెందిన పామాల్ల కొండప్ప, పామాల్ల సరస్వతి దంపతుల గృహ ప్రవేశ మహోత్సవానికి తమ ఇంటి ఇలవేల్పు అయిన కుర్లపల్లయ్య స్వామిని శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రూరల్ మండలం ధర్మపురి గ్రామం నుంచి రాప్తాడుకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రంతా భక్తిశ్రద్ధలతో స్వామిని ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులను తీర్చుకున్నారు.

నీట్ పీజీలో మణిదీప్‌కు 151వ ర్యాంకు


కృష్ణ మణిదీప్ యాదవ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో కృష్ణ మణిదీప్ యాదవ్ 151వ ర్యాంకు సాధించాడు. కర్నూలు జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన ఇతడు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో (2016–2021 బ్యాచ్) ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. కృష్ణమణిదీప్ యాదవ్ 800 మార్కులకు 667 మార్కులతో ఆలిండియా 151వ ర్యాంకు సాధించాడు. అత్యుత్తమ ర్యాంకు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తక్కువ నీటితో డ్రాగన్ ఫ్రూట్ సాగు

యల్లనూరు: తక్కువ నీటితో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేయొచ్చని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గొడ్డుమర్రి గ్రామానికి చెందిన లోకేష్ సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలించారు. తర్వాత దంతపల్లిలో ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ప్యాక్ హౌస్‌ను సందర్శించారు.